క్లుప్తంగా

షికారు బోట్ల ధరలు నిర్ణయించిన మున్సిపాలిటీ

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ (సద్దుల చెరువు)పై ప్రారంభించిన బోటు షికారుకు మున్సిపాలిటీ ధరలు నిర్ణయించింది. మొత్తం రూ. 50లక్షల వ్యయంతో 13బోట్లను తెప్పించిన మున్సిపాలిటీ అందులో షికారు ధరలు నిర్ధారించినట్లు మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి తెలిపారు. 13బోట్లలో 4షికారు బోట్లు, 2 పెద్ద బోట్లు, 5 పెడస్టల్ బోట్లు, 2 స్పీడ్ బోట్లు ఉన్నాయని తెలిపారు. షికారు బోట్లతో పాటు పెద్ద బోట్లలో షికారు చేయాలనుకునే వారికి పెద్దలకు రూ. 50లు, పిల్లలకు రూ. 30లుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా స్పీడ్ బోట్లలో ఒక ట్రిప్పుకు రూ. 350లు కాగా అందులో కెపాసిటీ నలుగురికి ఉంటుందని తెలిపారు. పెడస్టల్ బోట్లలో ఒక్కొక్కరికి రూ. 50 ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఈ బోట్లు అందుబాటులో ఉంటాయని అన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

సూర్యాపేట : ధరణి టెక్నికల్ అసోసియేషన్‌ను భారత రాష్ట్ర ట్రేడింగ్ యూనియన్ (బీఆర్‌టీయూ)లో విలీనం చేస్తూ శుక్రవారం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ధరణి టెక్నికల్ స్టాఫ్ నూతన కార్యవర్గాన్ని జిల్లా కోఆర్డినేటర్ జానీ పాషా ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నగాని పురుషోత్తం, ఉపాధ్యక్షుడిగా నలబోలు నవీన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లింగరాజు, సహాయ కార్యదర్శిగా సంజీవరెడ్డి, కోశాధికారిగా రాతికింది గురుప్రసాద్, సహాయ కోశాధికారిగా సంపత్, గౌరవ సలహాదారులుగా వెంకయ్య, రాము, జానీపాషా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా షేక్ సలీం, బ్రహ్మం, విజేత, శ్రీలతలు ఎన్నికయ్యారు.

మేరు సంఘం మండల కమిటీ ఎన్నిక


నియామకపత్రాన్ని అందజేస్తున్న మేరు సంఘం నాయకులు

తుంగతుర్తి : మండల కేంద్రంలో మేరు సంఘం మండల కమిటీని శుక్రవారం ఎన్నికల అధికారి గుంటి సత్యనారాయణ, రేణిగుంట సురేందర్‌ల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మేరు సంఘం మండల అధ్యక్షుడిగా రామగిరి నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా దీకొండ సురేష్, కోశాధికారిగా గట్ల జోగయ్యలతో పాటు కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం నాయకులు కీర్తి వెంకటేశ్వర్లు, రాములు, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సిమెంట్ వితరణ


సిమెంట్‌ను అందజేస్తున్న వేల్పుల రమేష్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి గాను యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్ శుక్రవారం 40బస్తాల సిమెంట్‌ను ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 12నుంచి జరిగే ప్రతిష్ఠ మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఈదుల రమేష్‌చంద్ర, దానం యాదగిరి, ఉప సర్పంచ్ కేసాని రామనర్సయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి జహీర్ బాబా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న ఉమ్మడి జిల్లా కలెక్టరేట్ల ఎదుట జరిగే ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం మండల పరిధిలోని ఏపూరులో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ధర్నా కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొప్పుల కళింగరెడ్డి, బండి మల్లయ్య, వెంకటేశ్వర్లు, కవిత, సాయి చరణ్, మాధవి, రమణ, మంజుల, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నకిలీలతో తస్మాత్ జాగ్రత్త !

- విత్తనాల కొనుగోలులో అప్రమత్తంగా లేకుంటే ముప్పు
- నకిలీ విత్తనాలతో రైతులు మోసపోయే ప్రమాదం


నాగారంలో విత్తనాలు, ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ(షైల్)

నాగారం : ఈ ఏడాది కోటి ఆశలతో అన్నదాతలు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు ఇంకా వ్యవసాయ ఉపకరణలు సమకూర్చుకోవాల్సిన సమయం ఇది. మార్కెట్‌లో ఆయా ఉత్పత్తులకు సంబంధించి ఆయా కంపెనీల ప్రకటనలు రైతులను ఊరిస్తున్నాయి. విత్తనం కల్తీదైతే మొలకెత్తక ముందే రైతు చిత్తవుతాడు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే ముందు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవడం చాలా అవసరం.

సాగుకు సన్నద్ధం..

వానాకాలం పంట సాగులో భాగంగా రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమైనారు. ఈ సమయంలో పలు రకాల కంపెనీలకు చెందిన విత్తనాలు, పురుగు మందుల ప్రచారం ఊపందుకుంది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. విత్తుకొద్ది పంట అన్న నానుడిని దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన విత్తనాల కోసం రైతులు ఆరా తీస్తున్నారు. ఎరువులైన, విత్తనాలైన రైతులు ఈ సమయంలో చాలా అప్రమత్తమై ఉండాలి. ఒకటికి రెండు సార్లు ఆలోచించి అధికారుల సూచనలతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం మంచిది.

లైసెన్స్ ఉన్న డీలరు వద్దే కొనాలి



రైతులు తప్పనిసరిగా లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. విత్తనం నాణ్యత లోపిస్తే పంట దిగుబడికి ముప్పు వాటిల్లుతుంది. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలతో పంటలను సాగు చేసుకోవాలి.

– పెండోట గణేష్, ఏఓ, నాగారం

మోతాదుకు మించితే నష్టాలే..

రైతులు అధిక దిగుబడులపై కోటిఆశతో విత్తనాలతో పాటు ఎరువులు మోతాదుకు మించి వినియోగిస్తారు. ఇలా చేయడం వల్ల దిగుబడి మాట దేవుడెరుగు.. నష్టాలనే చవిచూడాల్సి వస్తుంది. పురుగు మందుల విషయంలోనూ మోతాదుకు మించవద్దని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. నేలల స్వభావాన్ని బట్టి పంటల ఎదుగుదల, చీడపీడల ఉధృతి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. భూమి పోషకాలను బట్టి ఎరువులు, పురుగు మందులు వేయడం ఉత్తమమని సూచిస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు ఒకేరకం పంట, విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల వేయకూడదు. ఇలా చేస్తే మొదటికే మోసం వస్తుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..

1.లైసెన్సు కలిగిన దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలను కొనగోలు చేయాలి. కొనుగోలు చేసిన వాటి బిల్లులను, ఖాళీ సంచులను పంట కాలం పూర్తయ్యేవరకు జాగ్రత్తగా ఉంచాలి.
2.మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే వాడాలి. ఒక వేళ చేతికుట్టుతో ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు ఖచ్చితంగా ఉండాలి.
3.కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే తక్షణమే వ్యవసాయశాఖ అధికారులతో ఎరువులను పరీక్షించుకోవాలి.
4.చిల్లులు పడి చిరిగిన ఎరువుల బస్తాలు కొనుగోలు చేయవద్దు. ఇతర పదార్థాలు కలిస్తే ఆ ఎరువును కల్తీగా గుర్తించాలి.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


మంత్రికి స్వాగతం పలుకుతున్న స్వాములు

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని రూప్లాతండాలో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్ నాయుడు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ వాంకుడోతు స్వప్ననాగరాజు, ఎంపీటీసీ వాంకుడోతు బాలాజీ, స్వాములు చిన్నజైరాం స్వామి, భద్రునాయక్ స్వామి, స్థలదాత మెంత బోయిన వీరయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు, ఉప సర్పంచ్ ధరావత్ భిక్షం, కమిటీ సభ్యులు లచ్చు, నాగరాజు, నగేష్, రమేష్, ప్రసాద్, క్రిష్ణ, వెంకన్న, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

సొసైటీ రైస్ మిల్లు లీజు విషయమై ఘర్షణ


మిల్లు వద్ద గుమిగూడిన గ్రామస్తులు, రైతులు

పెన్‌పహాడ్ : మిల్లు లీజు విషయమై ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణ జరిగిన సంఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని అనంతారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి సాగునీటిని అందించే శ్రీ వెంకటేశ్వర లిఫ్టు ఇరిగేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బిన్ని రైస్ మిల్లు ఉంది. మిల్లును కొన్ని సంవత్సరాల నుంచి లీజుకు ఇచ్చి లిఫ్టు ఇరిగేషన్ అవసరాలకు వాడుతున్నారు. ఇటీవల మిల్లు లీజు పూర్తి కావడంతో గ్రామానికి చెందిన కొంత మంది లీజుకు తీసుకున్నట్లుగా అంగీకార పత్రం ఇష్టానుసారంగా రాసుకున్నారని ఆరోపిస్తూ తిరిగి వేలం పాట నిర్వహించాలని రైతులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం మిల్లు వేలం పాట జరపడానికి నిర్ణయించుకోగా రైతులు, గ్రామస్తులు సొసైటీ వద్ద సమావేశమయ్యారు. సొసైటీ చైర్మన్ ఎన్నిక నిర్వహించిన తర్వాతనే మిల్లు లీజు విషయం మాట్లాడాలని రైతులు తెలపడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు. గ్రామస్తుల సమన్వయంతో లీజు వేలం పాట నిర్వహించిన తర్వాత మాత్రమే మిల్లు తెరచాలని అప్పటి దాక వీలు లేదని పోలీసులు మిల్లుకు తాళం వేసినట్లు తెలిపారు.

ఉత్సవాల పేరుతో డబ్బులు వృథా



మాట్లాడుతున్న ఏపూరి సోమన్న

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో కోట్ల రూపాయలు వృథా చేస్తోందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న విమర్శించారు. శుక్రవారం తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడి 9 సంవత్సరాలైనా ఇప్పటివరకు హామీలు అమలుకాలేదని అన్నారు. ఉత్సవాల పేరుతో వందల కోట్లను వృథా చేస్తున్నారని తెలిపారు. తిరుమలగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పడలేదని అన్నారు. తిరుమలగిరి మండలంలోని తిరుమలగిరి, మాలిపురం, తాటిపాముల, నందపురం, అనంతారం గ్రామాలకు దేవాదుల నీళ్లు రాలేదని తెలిపారు. తిరుమలగిరి మున్సిపాలిటీ భవనం పాత గ్రామంలోనే ఉండాలని డిమాండ్ చేశారు. అవినీతికి వ్యతిరేకంగా వైఎస్సార్ తెలంగాణ పార్టీ పోరాడుతుందని అన్నారు. ధరణి పోర్టల్ వల్ల భూ సమస్యలు పెరిగాయని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు చింతకుంట్ల పరమేష్, చంద్రశేఖర్, మహేష్, యాకన్న పాల్గొన్నారు.

రైతు పథకాలు అమలు చేస్తున్న కేంద్రం


అర్వపల్లిలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

అర్వపల్లి : రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య అన్నారు. రైతులు పండించిన పంటలకు ప్రధాని మోదీ మద్దతు ధర పెంచడాన్ని హర్షిస్తూ అర్వపల్లిలో శుక్రవారం ప్రధాని చిత్రపటానికి బీజేపీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతుల అభ్యున్నతికి కేంద్రం అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. సబ్సిడీపై ఎరువులను అందించడంతోపాటు యూరియా కొరత లేకుండా చేసిందని చెప్పారు. యాసంగి సీజన్ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పోసి నెలలు గడుస్తోందని, ఈ ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు మేడబోయిన యాదగిరి, మల్లెపాక సాయిబాబ, దేశగాని నర్సయ్య, కూర శంకర్, కంచర్ల నర్సింహారెడ్డి, మొల్కపురి చిరంజీవి, బంగారురాజు, గాజుల మహేందర్, సీహెచ్.హన్మంతు, జిన్నె అశ్విన్, నాగు వెంకన్న, వేల్పుల నరేష్, కడియం పవన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం


మద్దిరాలలో చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్యే


తిరుమలగిరి : జలాల్‌పురంలో గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మద్దిరాల : తెలంగాణ రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగేందర్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ వద్ద నిర్వహించిన తుంగతుర్తి నియోజకవర్గస్థాయి దశాబ్ది ఉత్సవాల్లో వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కోలాటాలతో, భేరి చప్పుళ్లతో, మత్స్యకారులు వలలను అలంకరించి వినూత్నంగా వారికి ఘనస్వాగతం పలికారు. ముందుగా రూ.21లక్షలతో చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్, బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ శోభన్‌బాబు, తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మినేని ప్రవంతి సతీష్, ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర వెంకన్న, జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నగౌడ్, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సరోజ, వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, నల్లు రామచంద్రారెడ్డి, ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయాశాఖల అధ్యక్షులు, రైతు బంధు కోఆర్డినేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం తిరుమలగిరి మండలం జలాల్‌పురం గ్రామంలో గొర్రెల యూనిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 28 మంది లబ్ధిదారులకు యూనిట్లను పంపిణీ చేశారు. కుల వృత్తులను ప్రోత్సహించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. గొర్రెల పెంపకం వృత్తిగా జీవనం సాగిస్తున్న గొల్లకురుమలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏపీడీ కిరణ్‌కుమార్, ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమ్మినేని ప్రవంతిసతీష్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ బొడ్డు సుజాత, సర్పంచ్‌లు వెంకన్న, మహేష్, తహసీల్దార్ రమణారెడ్డి, ఎంపీడీఓ ఉమేష్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవర్చుకోవాలి


నాగారం : పసునూర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

నాగారం : ప్రతి ఒక్కరూ దైవ భక్తి అలవర్చుకోవాలని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పసునూర్ గ్రామంలో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో నిర్వహించే పండుగలతో ప్రజల్లో ఐకమత్యం పెంపొందుతుందన్నారు. అనంతరం స్వామి వారికి భక్తులు టెంకాయలు సమర్పించి, జలబిందెలతో జలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, రైతుబంధు సమితి జిల్లా కమిటీ సభ్యుడు పాదిల రమేష్‌గౌడ్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ గుండగాని అంబయ్య గౌడ్, సర్పంచ్ వేర్పుల సాలయ్య, ఉపసర్పంచ్ కృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు కూరం వెంకన్న, నల్లగంటి మల్లయ్య, చిత్తలూరి వెంకన్న, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

12న ఉచిత మెగా వైద్యశిబిరం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

తుంగతుర్తి : ఈ నెల 12న మండల కేంద్రంలోని శ్రీ విద్యా భారతి ఉన్నత పాఠశాల ఆవరణలో కృష్ణవేణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా ఉచిత వైద్య శిబిరాన్ని జయప్రదం చేయాలని కృష్ణవేణి ఫౌండేషన్ చైర్మన్ ఎస్.కృష్ణవేణి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో మెగా హెల్త్‌క్యాంపుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. అపోలో స్పెక్ట్రా వారి సౌజన్యంతో సాధారణ వైద్య సేవలతోపాటు గుండెకు సంబంధించి కూడా ఉచితంగా వైద్య సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ జాతీయ ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్, జర్నలిస్టులు తాళ్లపల్లి సోమన్న, ఎండీ నజీర్, సుభాష్, రామచంద్రు, ఉపాధ్యాయులు మల్లయ్య, గోపాల్ పాల్గొన్నారు.

తిరుమలగిరి : తుంగతుర్తిలో ఈ నెల 12వ తేదీన జరిగే హెల్త్ క్యాంపును విజయవంతం చేయాలని ఐజేయూ జాతీయ ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్ కోరారు. శుక్రవారం తిరుమలగిరిలో హెల్త్ క్యాంపు కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. కృష్ణవేణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ హెల్త్ క్యాంపును తుంగతుర్తిలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరి లక్ష్మయ్య, సునీల్‌కుమార్, నవీన్, సాయికుమార్, మహేష్, నేత పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

నూతనకల్ : ఆరోగ్య పరిరక్షణ కోసం కృష్ణవేణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న తుంగతుర్తి మండల కేంద్రంలో నిర్వహించే హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్ కృష్ణవేణి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో హెల్త్‌క్యాంపు పోస్టర్లను ఐజేయూ జాతీయ ఉపాధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్‌తో కలిసి ఆవిష్కరించారు. అపోలో స్పెక్ట్రా అమీర్‌పేట వారి సౌజన్యంతో నిర్వహించే హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రమేష్, శంభారెడ్డి, రవికుమార్, మరికంటి రమేష్, రవి, మహేష్, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం


రూ.15వేల ఆర్థికసాయం అందజేస్తున్న ప్రీతం, చెవిటి వెంకన్నయాదవ్

అర్వపల్లి : కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీసెల్ చైర్మన్ నాగరిగారి ప్రీతం చెప్పారు. అర్వపల్లికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు ఈద అన్వేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మృతుడి కుటుంబాన్ని శుక్రవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి తల్లి సరోజకు రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరు అధైర్యపడవద్దని చెప్పారు. ఆపదలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, ఎల్సోజు నరేష్, తిరుమలప్రగడ కిషన్‌రావు, దాసరి సోమయ్య, శిగ నసీర్‌గౌడ్, బైరబోయిన మహరాజు, నర్సింగ కృష్ణమూర్తి, కమటం రాజు, మద్దెల రవి, దొనకొండ వెంకన్న, శేఖర్, నిమ్మల కుమార్, అశోక్, కోడి కుమార్, మద్దెల వినయ్, సుదర్శన్, బన్ని తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరిగారి ప్రీతం ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామానికి చెందిన వీరబోయిన పర్వతాలు కుమారుడు సందీప్, అదే గ్రామానికి చెందిన మరికంటి సైదమ్మలు మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, కళ్లెం కృష్ణారెడ్డి, ఎంపీటీసీ తండు రేణుకశ్రీనివాస్, పల్సా లింగయ్య, తుంగతుర్తి విద్యాసాగర్‌రావు, గుగులోతు కృష్ణ, మరికంటి సంజీవ, బొడ్డుపల్లి అంజయ్య, పసుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలి

భానుపురి : టీఎస్ ఆర్టీసీ సంస్థను లాభాల్లోకి తెచ్చి బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని డీఎస్పీ నాగభూషణం అన్నారు. శుక్రవారం సూర్యాపేట ఆర్టీసీ డిపోలో నిర్వహించిన విలేజ్ ఆఫీసర్స్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో వెళ్తే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని గుర్తుంచుకోవాలన్నారు. సురక్షిత ప్రయాణం కోసం తప్పకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ సురేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షాధార పంటల సాగుపై సర్వే


మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి జానిమియా

సూర్యాపేట రూరల్ : తాళ్లఖమ్మంపహాడ్ గ్రామంలో వర్షాధారంగా సాగయ్యే భూములు, విస్తీర్ణంపై శుక్రవారం వ్యవసాయ అధికారులు సర్వే నిర్వహించారు. గ్రామంలో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, బోర్లు, బావులతో పాటు వర్షాధారంగా సాగవుతున్న పంటల వివరాలు, సాగు విస్తీర్ణం వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహ్మద్ జానిమియా, ఏఈఓ ముత్తయ్య, ఉప సర్పంచ్ పాముల సైదులు, రైతుబంధు కో ఆర్డినేటర్ అండెం మారయ్య, మాజీ సర్పంచ్ కాశయ్య, రైతులు మిర్యాల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చేపల పెంపకంపై అవగాహన

భానుపురి: ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో భాగంగా శుక్రవారం రెండో రోజు సూర్యాపేటలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో మత్స్యశాఖ జిల్లా అధికారి రూపేందర్ సింగ్ ఆధ్వర్యంలో సాంకేతిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య పరిశోధన కేంద్రం పాలేరు అసిస్టెంట్ ప్రొఫెసర్ జీ.రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై ఔత్సాహికులకు చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులు, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ జ్యోతిలక్ష్మి మత్స్యకారులు, మత్స్య రైతులకు మంజూరు చేసే రుణాల గురించి తెలియపర్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు, ఔత్సాహికులు, మత్స్య రైతులు, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

తుంగతుర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వైస్ ఎంపీపీ మట్లపల్లి శ్రీశైలం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కర్విరాల కొత్తగూడెం జెడ్పీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వెలిశాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.శ్రవణ్‌కుమార్ కోరారు. శుక్రవారం వెలిశాల గ్రామంలో బడి బాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.సోమయ్య, ఉపాధ్యాయులు మల్లయ్య, రామాంజనేయులు, ఎల్లమ్మ, అనితాకుమారి, ఉపేందర్, దస్తగిరి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సూర్యాపేట టౌన్: జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తూ.. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సూర్యాపేటలోని డీఈఓ కార్యాలయంలో డీఈఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఫీజులు వసూలు చేసే విద్యాసంస్థలపై చర్యలు తీసుకొని, ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్ ఫీజు, పుస్తకాలు, యూనిఫాం పేర మరో రకంగా విద్యావ్యాపారం కొనసాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపి, సింహాద్రి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంధు అన్ని కులాలకు ప్రకటించాలి

భానుపురి : బీసీ కులాల జాబితాలో ఉన్న అన్ని కులాలకు బీసీ బంధు పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్ నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక విద్యానగర్‌లో బీసీ విద్యార్థి సంఘం సూర్యాపేట జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం బీసీ కులాల్లో కొన్ని కులాలకు మాత్రమే లక్ష రూపాయలు ప్రకటించి చేతులు దులుపుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇతర వర్గాలకు పది లక్షల రూపాయల బంధు కేటాయించి బీసీలకు మాత్రం లక్ష రూపాయలే ఇవ్వడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు గిరి, రాజు, మధు, ప్రశాంత్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంధు ప్రవేశపెట్టాలి

తిరుమలగిరి : జనాభాలో 50 శాతం పైగా ఉన్న బీసీ కులాలకు తూతూ మంత్రంగా రూ.1 లక్ష ఇచ్చి చేతులు దులుపుకోవడం సమంజసం కాదని, దళిత బంధు పథకంలాగా ప్రతి ఒక్కరికీ రూ.10 లక్షలు ఇవ్వాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీకి చెందిన అన్ని కులాలకు బీసీ బంధు ప్రవేశ పెట్టాలన్నారు. కుల వృత్తుల పథకంలో గౌడ, యాదవ, ముదిరాజ్ కులాలను విస్మరించడం సరైన పద్ధతి కాదన్నారు.

గీత కార్మికులకు రూ.లక్ష సాయం అందించాలి

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాలకు అందించే రూ.1లక్ష సాయాన్ని కల్లుగీత కార్మికులకు కూడా అందించాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బాలగాని రేణుక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నాగారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. గతంలో విడిగా ఉన్న కల్లుగీత కార్పొరేషన్‌ను బీసీ కార్పొరేషన్‌కు అనుసంధానం చేశారని అన్నారు. బీసీ కార్పొరేషన్‌లో ఉన్న మిగితా కులాలకు రూ.1లక్ష ఆర్థిక సాయం ఇస్తూ కల్లుగీత కార్మికులకు ఇవ్వకపోవడం సరికాదన్నారు. కుల వృత్తుల్లో ప్రమాదకరమైన వృత్తి కల్లు గీయడమేనన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కల్లు గీత కార్మికులకు రూ.1లక్ష ఆర్థికసాయం ప్రకటించాలని కోరారు. ఆమెతో పాటు కల్లుగీత కార్మిక సంఘం నాయకులు బుర్ర పూలమ్మ, బాలగాని మురళి, బుర్ర ఎల్లాగౌడ్, ఉప్పలయ్య, మొగుళ్ల మహేష్, బండి శ్రీను, నర్సింహస్వామి, లింగయ్య, కొమరయ్య, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.